సాక్షి
జగిత్యాల

దుబ్బరాజన్న హుండీ ఆదాయం రూ.7.79లక్షలు



సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.7,79,255 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మహాశివరాత్రి, ఏడాది పొడవున కొబ్బరికాయలు, బెల్లం అమ్మకాలకు టెండర్ పిలవగా.. ధర రాకపోవడంతో వాయిదా వేశారు. పూల అలంకరణకు రూ.74,340, కిరాణాలకు రూ.10,106, ఆలయానికి రంగులు, సున్నం వేసేందుకు రూ. 1.24 లక్షలు, చలవపందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటుకు రూ.98 వేలు, టెంట్లు, వంటసామగ్రి సరఫరా చేయడానికి రూ.58 వేలకు టెండర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, నాయకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంగళవారం । 21 । జనవరి । 2025

న్యూస్‌రీల్

రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: రూ.70 కోట్లతో జగిత్యాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 14, 15, 31 వార్డుల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, గిరి నాగభూషణం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన మారంపల్లి హర్షిత వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌వోసీ అందజేశారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ పరిధిలోని రఘురాములకోటను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మెట్‌పల్లి మండలపరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు గుడ్ల మనోహర్ తల్లి చనిపోగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, కాశిరెడ్డి మోహన్ రెడ్డి,అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్, నాయకులు కౌన్సిలర్లు సత్యం, రఫీ,సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి, ఎంపీ వంశీ

బుగ్గారం(ధర్మపురి): ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రూ.15 కోట్లతో పట్టణంలో చేపట్టే సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, చిల్డ్రన్స్ పార్క్, బస్తీ దవాఖానా, ఆర్చిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తాగు, సాగునీరు, కరకట్ట నిర్మాణం, మురుగునీటి శుద్ధి ప్లాంట్, శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించామని తెలిపారు. ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లను మళ్లించేందుకు రూ.1.15 కోట్లు కేటాయించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలోనే ఐసీయూ ప్రారంభిస్తామని, పాశిగాంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెవెన్యూ డివిజన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మీ, సంగనభట్ల సంతోషి, గరిగె అరుణ, యూనుస్, కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి

జగిత్యాల: విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.8 ఉంటే ప్రభుత్వం రూ.5 చెల్లిస్తోందని, దీంతో గుడ్డుకు రూ.3 చొప్పున మధ్యాహ్న భోజన వర్కర్లు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు లేనందున రెండు కూరలతో భోజనం పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. వంట కార్మికులకు వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శారద, లక్ష్మీ, మల్లీశ్వరి, లత పాల్గొన్నారు.

చెత్త సమస్య తొలగేదెన్నడో..?

- వేరుచేయకుండానే తడి, పొడి చెత్త తరలింపు
- నిరుపయోగంగా పొడి వనరుల సేకరణ కేంద్రం
- డంపింగ్‌యార్డులో నిత్యం మంటలే..
- కాలుష్యంతో సతమతమవుతున్న కాలనీలు



డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ



నిరుపయోగంగా పొడి చెత్త సేకరణ కేంద్రం

జగిత్యాల: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. సిబ్బంది పట్టింపులేని ధోరణితో జగిత్యాల బల్దియా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాకేంద్రమైన జగిత్యాలలో నిత్యం చెత్తను సేకరిస్తున్నారు. అయితే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి వార్డుకు వెళ్తున్న వాహనాలు ఇళ్ల నుంచి మహిళలు తీసుకొచ్చిన చెత్తను తరలిస్తున్నాయి. అయితే ప్రజలకు తడి, పొడి చెత్త వినియోగంపై అవగాహన కల్పించకపోవడంతో మహిళలు వేరు చేయడం లేదు. ఇది ఇబ్బందికరంగా మారింది. వాస్తవానికి తడి చెత్తను ఎరువుగా తయారు చేసే అవకాశం ఉంది. ఫలితంగా బల్దియాకు ఆదాయం కూడా వస్తుంది. మున్సిపల్ అధికారులు, పర్యావరణ అధికారులు ఈ విధానాన్ని పట్టించుకోవడం లేదు. జిల్లాకేంద్రంలోని నూకపల్లి ప్రాంతంలో రూ.లక్షలు వెచ్చించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసేందుకు షెడ్డును నిర్మించారు. దీని నిర్వహణను గతంలోనే మహిళాసంఘాలకు అప్పగించారు. వారు నిత్యం తడి, పొడి చెత్తను వేరు చేసి పొడి చెత్తను విక్రయించాల్సి ఉంటుంది. ఈ బాధ్యతను కొన్నిరోజులు నిర్వర్తించిన మహిళ సంఘాలు కొన్ని కారణాలతో చేతులెత్తేశారు. ప్రస్తుతం ఆ షెడ్డు సైతం వృథాగానే ఉంటోంది. వార్డుల నుంచి సేకరించిన చెత్తను కార్మికులు డంపింగ్‌యార్డులోనే పడేస్తున్నారు. ఫలితంగా ఎరువుల తయారీ కోసం నిర్మించిన షెడ్లు కూడా వృథాగానే ఉంటున్నాయి. వీటిపై బల్దియా అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆదాయానికి భారీగానే గండిపడుతోంది.

నిత్యం మంటలే..

నర్సింగాపూర్ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఉంది. సమీపంలోనే న్యాక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డంపింగ్‌యార్డును ఆనుకునే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. ఈ గృహాల్లో కొంతమంది ఇప్పుడిప్పుడే చేరుతున్నారు. తడి, పొడి చెత్తను సేకరించిన కార్మికులు డంపింగ్‌యార్డులో పడేస్తున్నారు. స్థానికులెవరైనా బీడీ, సిగరేట్ పడేస్తున్నారో.. ఇతర కారణాలేమో గానీ.. డంపింగ్‌యార్డులో నిత్యం మంటలు అంటుకుంటున్నాయి. దీంతో దట్టమైన పొగ ఇళ్లలోకి చేరుతోంది. ఇటీవల వారంపాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలోని ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. శ్వాస తీసుకోవడానికీ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోనే ఉన్న న్యాక్ కేంద్రంలో వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పొగతో వేగలేకపోయారు.

కాలుష్య కోరల్లో కాలనీలు

డంపింగ్‌యార్డులో నిత్యం పొగలు అంటుకుని ఆ కాలనీలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం చెత్తను కాల్చకూడదు. ఆ పొగ వస్తే మనుషుల గుండె, ఊపిరితిత్తులపై అధిక ప్రభావం పడుతుంది. మనుషుల ఆరోగ్యంతోపాటు, పర్యావరణాన్ని దెబ్బతీసే కాలుష్య కారకాల్లో పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ ఆక్సైడ్ ఉంటాయని అంటున్నారు వైద్యులు. గాలిలో పీఎం 2.5 స్థాయికి పెరిగే కొద్దీ వృద్ధులు, పిల్లలు శ్వాసకోశ వ్యాధులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. డంపింగ్‌యార్డులో పొగలు అంటుకోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం బల్దియాపై ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

వినియోగంలోకి తెచ్చేదెప్పుడో..?

డంపింగ్‌యార్డులో ఏర్పాటు చేసిన పొడి వనరుల సేకరణ కేంద్రం నిరుపయోగంగా మారింది. గతంలో మహిళ సంఘాలకు అప్పగించినప్పటికీ అక్కడ పనిచేసిన ఆర్పీ రిజైన్ చేసి వెళ్లిపోయారు. బల్దియా అధికారులు అప్పటి నుంచి మరొకరికి ఇవ్వకపోవడం, అసలు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కనీసం ఏజెన్సీ వారికైనా ఈ తడి, పొడి చెత్త సేకరణ ఇస్తే అటు బల్దియాకు ఆదాయంతో పాటు, ఇటు ప్రజలకు ఇబ్బందులు తప్పే అవకాశం ఉంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తేవడంతో పాటు, డంపింగ్‌యార్డులో కాలుష్యాన్ని నియంత్రించాలని కాలనీవాసులు కోరుతున్నారు. బల్దియాలో ప్రత్యేకంగా ఎన్విరాన్‌మెంటల్ అధికారులను ఏర్పాటు చేసినప్పటికీ వారు కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు



పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. తడి, పొడి చెత్త వేరు చేయాలని ఇప్పటికే సూచనలు ఇచ్చాం. ప్రజలు సైతం సహకరించాలి. ఏజెన్సీకి అందజేసేలా చర్యలు చేపట్టాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

గ్రామసభలకు వేళాయే..



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత, తదితరులు

- సంక్షేమ పథకాల అమలుకు నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక
- ఆత్మీయ భరోసా, రైతు భరోసా జాబితా ఇక్కడే ఖరారు
- అభ్యంతరాల అనంతరం తుది లిస్ట్ అప్‌లోడ్
- కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు తాజాగా దరఖాస్తులు
- గ్రామసభల కోసం సొంతూళ్లకు దరఖాస్తుదారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ షురూ అయ్యింది. ఇప్పటికే ఇంటింటికి తిరిగి సర్వేనిర్వహిస్తున్న అధికారులు మంగళవారం నుంచి గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికార యంత్రాంగం తయారు చేయనుంది. గతంలో ప్రజాపాలన, కులగణన సర్వేలో వివరాలు నమోదు చేయించుకోని వారు సైతం కొత్తగా గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో ఇప్పుడు అందరి చూపు గ్రామసభలపై ఉంది. పైరవీలకు తావులేకుండా పారదర్శకతతో గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తారా? లేదా అనే చర్చ లబ్ధిదారుల్లో కొనసాగుతోంది.

నేటి నుంచి గ్రామసభలు

గ్రామసభల కోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి కలెక్టర్లు సిద్ధంగా ఉన్నారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీల స్పెషలాఫీసర్లు, క్లస్టర్ ఆఫీసర్లు, వారికి కింద సిబ్బంది సభల్లో పాల్గొంటారు. ఇప్పటికే ఆయా పథకాల అర్హులైన వారిని గుర్తించేందుకు యంత్రాంగం సర్వే నిర్వహించి ముసాయిదా జాబితాను సిద్ధం చేసింది. ఆయా జాబితాలను గ్రామాల్లో, బల్దియాల్లో వార్డులవారీగా ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో ముసాయిదా జాబితా ప్రదర్శించి, లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించనున్నారు. గ్రామసభల ఆమోదం పొందిన జాబితాను జిల్లాఇంచార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఎంపీడీవో లాగిన్ ద్వారా ముసాయిదా జాబితాను డౌన్‌లోడ్ చేసుకుని, అభ్యంతరాల అనంతరం అదే లాగిన్ ద్వారా తుది జాబితాను అప్‌లోడ్ చేయనున్నారు. కీలక పథకాలకు ఆధారమైన గ్రామసభలకు హాజరయ్యేందుకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు రానున్నారు.

గ్రామసభల్లో కొత్త దరఖాస్తులు..

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల జాబితా జిల్లాయంత్రాంగానికి చేరింది. అందులో చాలామంది అర్హులైన వారి పేర్లు లేవు. దీంతో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చే యడానికి పోయినప్పుడు ప్రజల నుంచి నిరసన, వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తాజా గా కొత్తవారికి అవకాశం కల్పించాలని కలెక్టర్లకు మార్గదర్శకాలను సీఎస్ జారీచేశారు. పాత కార్డులు ఉండటంతో పాటు, చేర్పులు మార్పుల కోసం, ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులతో పాటు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు సైతం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని పరిశీలించాలని మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఇటీవల కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో విలీనం అయిన గ్రామాల్లో సైతం 2023–24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధిహామీ కూలీ పనులకు పోయిన వారిని అర్హులుగా గుర్తించనున్నారు. అర్హులైన వీరిని గ్రామప్రజలకు ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేల సహాయం అందించనున్నారు.

అర్హులను ఎంపిక చేయండి

జగిత్యాల: సంక్షేమ పథకాల కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అర్హులనే ఎంపిక చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం అధికారులతో సమావేశమైన ఆయన ఈనెల 21 నుంచి 24 వరకు జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో వార్డు, గ్రామసభలు నిర్వహించాలన్నారు. అన్ని మండలాల్లో ప్రత్యేకాధికారులను నియమించామ ని, సభల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్నా అర్జీలు ఇవ్వొచ్చని సూచించారు. అవసరమైన టోల్‌ఫ్రీ నంబరు 9666234383 లో సంప్రదించవచ్చన్నారు. అదనపు కలెక్టర్లు లత, గౌతమ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

జగిత్యాల: గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో సజావుగా పనిచేయాలని ఆదేశించారు. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తున్నందున వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపించాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేడుకలను విజయవంతం చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

బ్యాంకుల వద్ద భద్రత పెంచాలి



మాట్లాడుతున్న ఎస్పీ



పాల్గొన్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది

జగిత్యాలక్రైం: జిల్లాలోని బ్యాంకుల వద్ద భద్రత పాటించాలని, ఏటీఎంల వద్ద సెక్యూరిటీగార్డులు తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్షించారు. బ్యాంకులలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద ఏదైనా అనుకోని సంఘటన జరిగితే సిబ్బంది ఎలా స్పందించాలనే దానిపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. బ్యాంకుల నుంచి బంగారం, డబ్బులు డ్రా చేసుకుని వెళ్లేవారిని అనుసరించి దొంగతనాలు చేస్తున్నారని, వీటిని నివారణకు బ్యాంక్ బయట వాహనాలు నిలిపే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, ఎస్బీ సీఐ ఆరీఫ్ అలీఖాన్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రైవేటు పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లు పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. స్కూల్ వాహనాలకు చిన్న ప్రమాదం జరిగినా డ్రైవర్లు, యాజమాన్యంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే వినియోగించాలన్నారు. డీఎస్పీ రఘుచందర్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్ఐ వేణు, ఎస్సైలు సదాకర్, మల్లేశం, గీత, స్కూల్ వ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, పోలీసు సిబ్బంది, స్కూల్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

జగిత్యాల: విద్య, వైద్యం ప్రాథమిక హక్కు అని, ప్రతి పాఠశాలలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. జగిత్యాల బల్దియా పరిధిలో పాఠశాలలన్నీ సొంత భవనాల్లోనే కొనసాగుతున్నాయని, కొన్నిచోట్ల ఇబ్బందులున్నాయని పేర్కొన్నారు. స్థానికుల సహకారంతో గతంలో గాంధీనగర్‌లో ఐదు గుంటల భూమి కొనుగోలు చేశామని, ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం నిర్మించుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్పెషల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మరో రూ.20 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ క్లాసులకు టిఫిన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, రమేశ్‌బాబు, జీవన్, శేఖర్, మధు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మూసివేత దశ నుంచి అభివృద్ధిలోకి..

- సహకార సంఘాలకు వరంగా ధాన్యం కొనుగోళ్లు
- 281 కేంద్రాల ద్వారా 21.64 లక్షల క్వింటాళ్లు సేకరణ
- రూ.502.02 కోట్ల ధాన్యం సేకరణకు రూ.6.92కోట్ల కమీషన్



జగిత్యాల సహకార సంఘం

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోళ్లు సహకార సంఘాలకు వరంగా మారాయి. ఒకప్పుడు రైతులకు పంట రుణాలు ఇవ్వడం.. తిరిగి రికవరీ చేయడానికే పరిమితమైన సంఘాలు.. ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ కమీషన్ రూపంలో మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. సంఘం పరిధిలోని రైతులకు ఇబ్బంది కలగకుండా ఎక్కడికక్కడ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇలా ఈ వానాకాలం సీజన్‌లో రూ.502.02 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశాయి.

281 కొనుగోలు కేంద్రాలు

సహకార సంఘాల ద్వారా జిల్లావ్యాప్తంగా 281 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320 చొప్పున కొని మిల్లులకు పంపించింది. జిల్లా సహకార అధికారుల పర్యవేక్షణలో చైర్మన్లు, డైరెక్టర్లు కేంద్రాలను ప్రతిరోజూ పర్యవేక్షించారు. రైతులకు ఇబ్బంది ఏర్పడకుండా చూశారు. ఐకేపీ కంటే ముందే గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించి.. ఈ వానాకాలం సీజన్‌లో 44,779 మంది రైతుల నుంచి రూ.502.02 కోట్ల విలువైన 21.61 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

రూ.6.92కోట్ల కమీషన్

ధాన్యం కొనుగోలు చేసినందుకు సివిల్ సప్లై సంస్థ సహకార సంఘాలకు క్వింటాల్‌కు రూ.32 చొప్పున కమీషన్ ఇస్తుంది. ఈ లెక్కన 21.61లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించినందుకుగాను సహకార సంఘాలకు రూ.6.92 కోట్ల కమీషన్ రానుంది. సహకార సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి.. ఎక్కువ మొత్తంలో ధాన్యం కొంటే ఆ మేరకు కమీషన్ డబ్బులు వస్తాయి. దీంతో సంఘాలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పోటీ పడ్డాయి. అయితే కొనుగోళ్లు పూర్తి కాగానే కమీషన్ అందించాల్సిన సివిల్ సప్లై సంస్థ తాత్సారం చేస్తుండటంతో బకాయిలు పెండింగ్‌లో ఉంటున్నాయి. చాలా సహకార సంఘాలు ధాన్యం కొనుగోలు కమీషన్ డబ్బులతో మరిన్ని వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వ్యాపారంలో ఉన్న సంఘాలు.. పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. గ్రామాల్లో సూపర్ మార్కెట్లు పెట్టే ఆలోచన కూడా చేస్తున్నాయి. కూలీల శ్రమను తగ్గించేందుకు ఆధునిక పరికరాలను కొనుగోలు చేసి, రైతులకు అద్దెకు ఇచ్చేందుకూ ప్రయత్నిస్తున్నాయి. అలాగే రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు.. ఎరువుల బస్తాల నిల్వ కోసం గోదాంలు నిర్మిస్తోంది. పంట రుణాలే కాకుండా వాహనాలు, బంగారం తాకట్టు రుణాలు, విదేశీ విద్య రుణాలు కూడా ఇస్తోంది. ఈ క్రమంలో కమీషన్ త్వరగా విడుదల చేస్తే సంఘాలకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని రైతులు అంటున్నారు.

సంఘాలకు మంచి ఆదాయం



ధాన్యం కొనుగోలుతో వచ్చే కమీషన్ సహకార సంఘాలకు ఊపిరినిస్తోంది. గతంలో ఏలాంటి ఆదాయం లేక సంఘాలు మూతపడే పరిస్థితి నెలకొంది. మా సంఘం పరిధిలోనే దాదాపు 10 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ధాన్యం సేకరించి మంచి ఆదాయం సంపాదించాం.

– పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్, జగిత్యాల

కొనుగోలుకు పోటీ



సహకార సంఘాలు ధాన్యం కొనుగోలుకు పోటీ పడుతున్నాయి. కొన్ని సంఘాలు ఆయా పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేసి ఐకేపీకి పోటీగా ధాన్యం సేకరిస్తున్నాయి. ఇలా వాటికి కమీషన్ రూపంలో వచ్చిన డబ్బులను సంఘం సభ్యులందరూ కలిసి చర్చించి మరిన్ని వ్యాపారాలు చేసేందుకు ఉపయోగిస్తున్నారు.

సీహెచ్.మనోజ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

ఆర్టిజన్ల సామూహిక నిరాహార దీక్ష

జగిత్యాలజోన్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లను పర్మినెంట్ చేస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం ఏడాదైనా పట్టించుకోవడం లేదని కార్మికులు అన్నారు. సోమవారం జగిత్యాల విద్యుత్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు సామూహిక నిరాహార దీక్ష చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్హతలను బట్టి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. దీక్షలో టీఆర్‌వీకేఎస్ డివిజన్ అధ్యక్షుడు మిడిదొడ్డి సతీశ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.



నిరాహార దీక్షలో ఆర్టిజన్లు

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై కేసు

జమ్మికుంట: ప్రైవేటు చిట్టీలు నడుపుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన రాపెల్లి కుమారస్వామి పట్టణానికి చెందిన మేకల శ్యామ్ సుందర్‌రెడ్డి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి వద్ద 2022 నుంచి రూ.5లక్షల చిట్టి వేశాడు. నెలకు రూ.15వేల చొప్పున ఫోన్‌పే ద్వారా 25 నెలలు డబ్బులు చెల్లించాడు. చిట్టి డబ్బులు ఇవ్వాలని అడగ్గా.. చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

లైంగికంగా వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న కత్తెరపాక దిలీప్‌ను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు పంపినట్లు ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన దిలీప్, అనంతగిరిక చెందిన వివాహితను వెంబడిస్తూ లైంగికంగా వేధించేవాడు. బాధితురాలి ఫిర్యాదుతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిందితునిపై బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రెండు కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి సంఘటనలో ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లి శివారులోని వ్యవసాయ భూముల విషయంలో ఆదివారం ముగ్గురిపై దాడిచేసిన సంఘటనలో ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. భూవివాదంలో గడ్డం పుష్పలతతోపాటు ఆమె ఇద్దరు కుమారులు కరుణాకర్, జగన్‌లపై దాడిచేసిన శ్రీనివాస్, నరేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగిలించి డబ్బులు డ్రా

మెట్‌పల్లి: ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండికి చెందిన గాండ్ల బాశెట్టి రణధీశ్ బ్యాంక్ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15న రణధీశ్ మెట్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు బస్సులో వెళ్తుండగా సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. అందులోని ఫోన్ పే నుంచి రూ.1.57లక్షలను వివిధ ఖాతాల్లోకి మళ్లించారు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైం, తర్వాత మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని గంజి రోడ్డు ప్రాంతానికి చెందిన ఉమేయ తహేర్ (14) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తహేర్ తొమ్మిదో తరగతి చదువుతోంది. నిత్యం సెల్‌ఫోన్ చూస్తూ ఉండడంతో మూడు రోజుల క్రితం తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం తల్లిదండ్రులు కోరుట్లలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న బాలిక ఇంట్లో ఉరేసుకుంది. తల్లిదండ్రులు వచ్చేసరికి మృతిచెందింది. బాలిక మృతికి నువ్వంటే నువ్వే కారణమని తల్లిదండ్రులు ఆస్పత్రిలో గొడవకు దిగారు. పట్టణ ఎస్సై కిరణ్ ఆస్పత్రికి చేరుకుని వారి సముదాయించారు. కుటుంబ సభ్యులతో ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్టీసీకి 'సంక్రాంతి' పండుగ

- కరీంనగర్ రీజియన్‌లో రూ.24.71కోట్ల ఆదాయం


కరీంనగర్ బస్టాండ్‌లో బస్సులు

కరీంనగర్: ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రాకపోకలతో అధిక ఆదాయం సమకూరింది. పండుగ సందర్భంగా ఈనెల 7 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపగా 13రోజుల్లోనే రూ.24.71 కోట్ల ఆదాయం సమకూరింది. 11 డిపో పరిధిలోని బస్సులు 43.21 లక్షల కిలోమీటర్లు తిరగగా.. 48.99 లక్షల ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. సంస్థకు రూ.24.71కోట్ల ఆదాయం సమకూరింది. గోదావరిఖని డిపో రూ.3.69 కోట్ల ఆదాయంతో మొదటిస్థానం, జగిత్యాల డిపో రూ.3.18 కోట్లతో రెండవ స్థానం, కరీంనగర్–2 డిపో రూ.3.16 కోట్లతో మూడో స్థానంలో నిలిచాయి. రీజియన్ నుంచి 1,740 ప్రత్యేక బస్సులను నడపగా జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 770 ప్రత్యేక బస్సులు, తిరుగుప్రయాణంలో కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 970 ప్రత్యేక బస్సులు నడిపించారు. పండుగ సీజన్‌కు తోడు మహాలక్ష్మి పథకం తోడుకావడంతో ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారు. కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో మకాం వేసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. దీంతో సంక్రాంతి ఆర్టీసీకి కలిసొచ్చింది.

ఈనెల 7 నుంచి 19 వరకు వచ్చిన ఆదాయం

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)	కిలోమీటర్లు (లక్షల్లో)	ప్రయాణికులు (లక్షల్లో)
గోదావరిఖని	3.69	6.01	7.53
హుస్నాబాద్	1.37	2.46	3.60
హుజూరాబాద్	1.75	2.88	4.12
కరీంనగర్–1	2.70	5.21	5.48
కరీంనగర్–2	3.16	6.36	4.38
మంథని	1.49	2.59	2.54
జగిత్యాల	3.18	5.58	6.33
కోరుట్ల	1.90	2.99	3.74
మెట్‌పల్లి	1.79	2.86	3.86
సిరిసిల్ల	1.84	3.04	3.83
వేములవాడ	1.83	3.23	3.59

ఆర్టీసీని ఆదరించాలి



కరీంనగర్ రీజియన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారందరికీ కృతజ్ఞతలు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఆదాయం తెచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లకు, డిపో మేనేజర్లకు శుభాకాంక్షలు. ముందస్తు రిజర్వేషన్లతో పాటు అదనపు చార్జీలు వసూలు చేయకుండా, మహాలక్ష్మి పథకం తోడు కావడంతో రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపి ఆదాయాన్ని సమకూర్చుకోగలిగాం.

– బి.రాజు, ఆర్‌ఎం, కరీంనగర్

రోగిని పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది


ఆస్పత్రిలో కింద పడుకున్న రోగి

జగిత్యాల: జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందించాల్సిన సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. ఇటీవల చికిత్స పొందుతున్న భర్తకు ఆసరాగా ఉన్న భార్య అనారోగ్యానికి గురికాగా.. ఆస్పత్రి సిబ్బంది ఆమెను బయటకు పంపించారు. ఇటీవల రాయపట్నంలో తండ్రీకొడుకులకు కత్తిపోట్లు కాగా డ్యూటీ డాక్టర్, వైద్య సిబ్బంది ఉన్నా వారిని పట్టించుకోలేదు. వార్డుబాయ్‌తో చికిత్స అందించారు. తాజాగా గొల్లపల్లి మండలానికి చెందిన భూమయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చాడు. ఆయనకు మానసిక పరిస్థితి సరిగా లేదు. దీంతో అతడిని ఓ గదిలో పడేశారు. బెడ్డు మీద కాకుండా కింద పడుకున్నా.. వైద్య సిబ్బంది మాత్రం అతడికి వైద్యం అందించలేదు. ఈ విషయంపై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా పేషెంట్ పరిస్థితి సరిగా లేదని, అతడిని బెడ్‌పై పడుకోబెట్టినా.. కిందనే పడుకుంటున్నాడని పేర్కొన్నారు.

కుల బహిష్కరణ చేశారని ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ కార్యాలయం ముందు బాధితులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాం, ఒర్రె సాయవ్వ, జక్కుల శారద, బైరి రాధ తమను కుల బహిష్కరణ చేశారని ఎస్పీ అశోక్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గొల్లకుర్మలు ఏటా సంక్రాంతి, ఉగాది పండుగలకు బోనాలు తీస్తారు. సంక్రాంతి సందర్భంగా తీసే బోనాలకు తమ కుటుంబాలకు సమాచారం అందించలేదని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామస్తుల సమక్షంలో కులస్తులను అడిగితే తమను కులం నుంచి బహిష్కరించామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థ పేరిట ఘరానా మోసం

- కలెక్టరేట్‌కు తరలి వచ్చిన బాధితులు


కలెక్టరేట్‌కు తరలి వచ్చిన గ్రామస్తులు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛంద సంస్థ ద్వారా తక్కువ ధరకే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సమీప బంధువు కావడంతోనే నమ్మి మోసపోయినట్లు ముస్తాబాద్ మండలం మోహినికుంట, మద్దికుంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. 2020లో బెంగళూరుకు చెందిన ×హోలి వరల్డ్స్ సిటిజెన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌¤ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తమ గ్రామాలకు వచ్చారన్నారు. సొంత స్థలం ఉన్న వారికి రూ.3.50 లక్షలకే కేంద్ర, రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వచ్చే డబ్బులతో ఇల్లు కట్టిస్తామని నమ్మబలికారని తెలిపారు. అప్పటి సీఎం కేసీఆర్‌కు సమీప బంధువైన ప్రజాప్రతినిధితో తమతో మాట్లాడించగా.. 70 మందిమి రూ.కోటి వరకు చెల్లించినట్లు వివరించారు. రెండేళ్ల తర్వాత కూడా ఇండ్లు నిర్మించకపోగా.. 2022లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో సదరు ప్రజాప్రతినిధితో వచ్చి సంస్థ ప్రతినిధులు చెక్కులు అందించి తమ వద్ద ఉన్న సంస్థకు చెందిన బాండ్లను తీసుకున్నారన్నారు. చెక్కులు ఇచ్చారుగా గొడవ చేయొద్దని సదరు ప్రజాప్రతినిధి తెలిపారని, అయినా చెక్కులు ఇప్పటికీ పాస్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బాధ్యులను ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండ్రని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు


దాబాలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: నగరంలో రెండు చోట్ల సోమవారం వేకుజామున అగ్నిప్రమాదాలు జరిగాయి. అగ్నిమాపక అధికారుల వివరాల ప్రకారం.. కరీంనగర్–పెద్దపల్లి బైపాస్‌లోని సోహెల్ దాబా పక్కన గుర్తు తెలియని వ్యక్తులు మంటకాగడంతో అగ్నికీలలు దాబాపై పడి మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. సుమారుగా రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని ఒక టింబర్ డిపోలో స్వల్పంగా కర్రలు కాలిపోయాయని ఫైర్ అధికారులు తెలిపారు.

కాలినడకన రాజన్న చెంతకు..

- కాలినడకన రాజన్న చెంతకు..
- పల్లికొండ నుంచి వేములవాడకు..
- 60 కిలోమీటర్లు పాదయాత్రగా కదిలిన మహిళలు


వేములవాడ రాజన్న దర్శనానికి కాలినడకన వస్తున్న పల్లికొండ మహిళలు

సిరిసిల్ల: మొక్కు తీర్చుకోవాలన్న తలంపు వారిని పాదయాత్రగా కదిలించింది. దాదాపు 60 కిలోమీటర్లు నడిచి వచ్చి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన 28 మంది మహిళలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన బయలుదేరారు. ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉన్నా.. కాలినడకన రావాలన్న మొక్కు తీర్చుకునేందుకు సోమవారం ఉదయం 6 గంటలకు పల్లికొండ నుంచి నడకను ప్రారంభించారు. మానాల, రుద్రంగి, చందుర్తి మీదుగా వేములవాడకు చేరుకోవాలి. కానీ ఒక్క రోజులో 60 కిలోమీటర్ల ప్రయాణం సాధ్యం కాకపోవడంతో సోమవారం రాత్రి చందుర్తి మండలంలో బసచేసి, మంగళవారం వేములవాడకు చేరుకొని రాజన్నను దర్శించుకోవాలని వస్తున్నారు.

ముస్తఫానగర్ శివారులో చిరుత సంచారం


గేదె కళేబరం పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముస్తఫానగర్ శివారులో చిరుత సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి చెందిన రాసమల్ల రాజు పొలం వద్ద గుడిసెలో కట్టేసిన గేదెపై చిరుత దాడి చేసింది. గేదె కళేబరాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అంజలి, ఫారెస్ట్ అధికారి రమేశ్ రైతులతో మాట్లాడారు. గేదెపై పులి దాడిచేసిన నేపథ్యంలో ఎవరూ అడవిలోకి వెళ్లవద్దని, పంట పొలాల్లో పశువులను కట్టివేయవద్దని, ఇంటికి తెచ్చుకోవాలని సూచించారు.

నా తండ్రిని సాదండి సారూ..

- నిస్సహాయ స్థితిలో కొడుకు మొర
- సిరిసిల్ల కలెక్టర్‌ను ఆశ్రయించిన నేతన్న


తండ్రిని సాదాలంటూ కలెక్టర్‌ను ఆశ్రయించిన గోనె శేఖర్

సిరిసిల్లటౌన్: కొందరి కష్టాలు చూస్తుంటే పగవారికి కూడా రావొద్దనిపిస్తుంటుంది. ఇటువంటి కష్టమే సిరిసిల్ల నేతన్నకు వచ్చింది. తాను నిస్సహాయ స్థితిలో ఉండగా సుమారు 90 ఏళ్ల వయస్సు ఉన్న తండ్రిని సాదలేనన్న బాధతో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను ఆశ్రయించన వైనం పలువురిని కంటతడి పెట్టించింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన గోనె శేఖర్ నేతకార్మికుడి(గతంలో)గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొడుకులు ఎవరూ లేరు. భార్య బీడీలు చుట్టేది కానీ గుండెజబ్బు బారిన పడడంతో పనిమానేసింది. నాలుగేళ్లుగా తనకు కూడా కాళ్లు సరిగ్గా పనిచేయక ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. తన తండ్రికి మతిస్థిమితం సరిగ్గా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసారా పింఛన్ డబ్బులతోనే తనకు, తన భార్యకు మందులు వెల్ల దీసుకుంటున్నట్లు తెలిపారు. మండేపల్లి శివారులోని కేసీ ఆర్‌నగర్‌లో ఉంటున్నామన్నారు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరికీ ఏ చికిత్స అవసరం పడ్డా చేయించుకోలేని స్థితిలో ఉన్నామన్నారు. తన తండ్రిని సాదాలని ఉన్నా తన నిస్సహాయ స్థితిని తలుచుకుని రోదించారు. కలెక్టర్ దయతలచి తన తండ్రి రామస్వామిని వృద్ధాశ్రమంలో చేర్పించి, వైద్యం చేయించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టి రామస్వామిని వృద్ధాశ్రమానికి తరలించే ఏర్పాట్లు చేశారు. గోనె శేఖర్ పరిస్థితిని చూసి ప్రజావాణికి వచ్చిన వారిని కలచివేసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పిట్ల లింగన్న (ఫైల్)

ఇబ్రహీంపట్నం: అప్పుల బాధతో ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్, కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ల లింగన్న అలియాస్ తోకల లింగన్న (41) తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నాడు. ఈ ఖర్చుతోపాటు పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నాడు. ఇలా మొత్తం సుమారు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. వాటిని ఎలా తీర్చాలని నిత్యం మదనపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న తన పొలానికి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెదుకగా క్రిమిసంహారక మందు తాగి పడిపోయి కనిపించాడు. వెంటనే అతడిని మెట్‌పల్లిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. లింగయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు. లింగన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


ఆశన్న (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మండలంలో ని గోదూర్ గ్రామానికి చెందిన రెబ్బాస్ ఆశన్న (72) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. ఆశన్న భార్య శాంత మూడు నెలల క్రితం గుండెపోటుతో చనిపోయింది. అప్పటి నుంచి తీవ్రంగా మదనపడుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. చిన్న కుమారుడు శాంతకుమార్ గమనించి వెంటనే మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆశన్న పెద్ద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూతపడుతున్న ఆన్‌లైన్ యాప్‌లు

- ఆందోళన చెందుతున్న పెట్టుబడిదారులు
- మధ్యవర్తులపై ఒత్తిళ్లు
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ వడ్డీ వస్తుందన్న ఆశతో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన వారికి ఆన్‌లైన్ కంపెనీలు రోజుకోటి బోర్డులు తిప్పేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. యాప్‌లు నిలిచిపోవడంతో తమ పెట్టుబడులు ఎలా తీసుకోవాలన్నదానిపై ఆందోళన చెందుతుండగా మధ్యవర్తులగా ఉన్నవారిపై తీవ్ర ఒత్తిళ్లు పెంచుతున్నారు. దీంతో వారు కూడా గుట్టచప్పుడు కాకుండా హైదరాబాద్, ముంబై వెళ్లి కంపెనీ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు రూ.150 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టిన పలు కంపెనీలు రెండునెలల్లో సుమారు నాలుగు మూతపడ్డాయి. దీంతో పెట్టుబడి పెట్టిన కొన్ని కంపెనీలు వారికి ఆన్‌లైన్ కంపెనీ యాప్‌ను మార్చుతున్నామని, ఆందోళన చెందవద్దని సమాచారం అందించారు. జిల్లాలో సుమారు ఇప్పటికే నాలుగు యాప్‌లు మూతపడ్డాయి.

మూతపడిన కంపెనీలు

జిల్లాలో పెట్టుబడి పెట్టిన నాలుగు ఆన్‌లైన్ యాప్‌లు రెండు నెలలుగా మూతపడ్డాయి. దీంతో తాము ఎవరిపై ఫిర్యాదుచేయలో తెలియక అయోమయంలోఉన్నారు. ఇప్పటికే మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లాలో రెండు కంపెనీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతమంది పెట్టుబడిదారులు ఇప్పటికే జైలుకు వెళ్లారు. మరికొందరు హైకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకున్నారు.

పరారీలో నిందితులు

వాస్తవానికి పోలీసులు కంపెనీ నిర్వాహకులపై కేసులు పెట్టాల్సి ఉండగా వారి వివరాలు లేకపోవడంతో పెట్టుబడి పెట్టించిన వారిపైనే కేసులు నమోదు చేశారు. దీంతో అసలు యాప్ తయారుచేసి పెట్టుబడులు పెట్టేలా చేసిన యాప్ యజమానులు పరారీలో ఉన్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



జిల్లాలో ఇప్పటికే యాప్ పెట్టుబడులు పెట్టించి మోసానికి పాల్పడగా బాధితుల ఫిర్యాదు మేరకు ఓ కంపెనీపై కేసులు నమోదు చేసి కొందరిని రిమాండ్‌కు తరలించాం. ఎవరైనా బాధితులుంటే ఫిర్యాదు చేయాలి. యాప్‌లపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడతాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

సీపీఐది పోరాటాల ఘనత

- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: భారతదేశ గడ్డపై వందేళ్ల మహోజ్వల పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ ఒక్క సీపీఐ మాత్రమేనని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా సోమవారం చిగురుమామిడిలో రెడ్‌షర్ట్ వలంటీర్లు వంద జెండాలు చేతబట్టి సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహం నుంచి బస్టాండ్ మీదుగా మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. చాడ వెంకట్‌రెడ్డి, మర్రి వెంకటస్వామి ర్యాలీలో పాల్గొన్నారు. సభకు మండల సీపీఐ కార్యదర్శి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. వేలాదిమంది అమరవీరుల త్యాగాల ఫలితంగా నేటికీ పార్టీ మనుగడ కొనసాగుతోందన్నారు. చిగురుమామిడి మండలం ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు సీపీఐకి కంచుకోటగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సీపీఐకి చిగురుమామిడి గుండెకాయలాంటిదన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లందుల రాజయ్య, బోయిని పటేల్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ కరీంనగర్

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


కరీంనగర్ జట్టుకు టోపీ అందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 46వ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చాంపియన్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. ద్వితీయ, తృతీయస్థానాల్లో వరంగల్, మహబూబ్‌నగర్, నాలుగోస్థానంలో ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. పోటీలకు రాష్ట్రంలోనే పాతపది జిల్లాలనుంచి 200మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయపోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు కరీంనగర్, వరంగల్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా 18–16 స్కోరు తేడాతో కరీంనగర్ విజేతగా నిలిచింది. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, డీఆర్‌వో పవన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెఫరీల బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, మూల వెంకటేశ్ పాల్గొన్నారు.






నందీశ్వరుడికి నాట్య నివేదన



వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కె.రతన్‌కుమార్ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వెల్ది నర్సింహమూర్తి, ఎస్.భారతి, ఎం.సుబ్రమణ్యశర్మ, శ్రీరాంభట్టార్‌ల హరికథాగానం, పి.వినయశర్మ వయోలిన్ కచేరి, ఉపాధ్యాయుల అపర్ణ, భావనల సంగీత కచేరి, డీవీ మోహన్‌కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరీ ఆహుతులను అలరింపజేశాయి. కళాకారులకు స్వామి వారి ప్రసాదాలను ఈవో వినోద్‌రెడ్డి అందించి, సత్కరించారు.



హరహర మహాదేవ

వేములవాడ: రాజన్న ఆలయంలో సోమవారం జనజాతర కనిపించింది. ఆలయ ఆవరణ, క్యూలైన్లు, జాతరగ్రౌండ్ ప్రాంతాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలను రద్దు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రతలో భాగంగా జిల్లా పోలీసులు బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. శివదీక్షాపరుల నిత్యాన్నదానసత్రానికి వరంగల్‌కు చెందిన వాగ్దేవి విద్యాసంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి దంపతులు కోసం రూ.1,01,116 విరాళం అందించారు. ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, సత్రం కోశాధికారి రాపెల్లి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు మచ్చ కిషన్, కార్యదర్శి రమణయ్య ఉన్నారు.



